# భోక్తలు

ఐ.ఎ. నరసింహం

మా అమ్మా నాన్నలకు నేనొక్కడ్నే కొడుకుని. నా పేరు నాని. అయిదేళ్ళవాడిని

ఆ రోజు—

రాత్రి ఎనిమిది గంటలు దాటింది. కళ్ళు పొడుచుకున్నా కనిపించని చీకటి. సాయంత్రం నుండి వర్షం కురుస్తూనే వుంది కాబట్టి దారంతా బురదగా వుంది

నేనూ అమ్మా నడుస్తున్నాం అమ్మ నా చెయ్యి పట్టుకుంది నన్ను చిన్నచిన్న బురద కాలువల్ని దాటించేటప్పుడు బాధగా మూలిగేది. అప్పుడు

"అలాగేరా!" అమ్మ మాట నిమిషం తరువాత చెప్పింది అంటే నాకు సమాధానం చెప్పడానికి అమ్మేదో ఆలోచనలో పడిందని అర్థం చేసుకున్నాను

"నువ్వెప్పుడూ అలాగే అంటావ్ ఇంటికెళ్ళాక ఓ చాప పరిచి పడుకోమని జోలపాడేస్తావ్ చీ .. ఇవాళ నీ పాట వినను. నాకు బువ్వ పెట్టాలంతే!" అన్నాను

అమ్మ సమాధానం చెప్పలేదు.

అమ్మ వెక్కి వెక్కి ఏడుస్తోంది. నేనలా

**ఆ వ్యక్తి, అమ్మా నేనూ నడుస్తున్నాం. మేమెక్కడి కెళ్తున్నామో, ఆ కొండయ్య బాబెవరో అతనెందుకు అమ్మను పిలిపించారో నేను అమ్మనడగలేదు. అమ్మ కూడా చెప్పలేదు. ఆ ఇంటికెళ్ళాక అన్నీ తెలిశాయి.**

అమ్మ వేపు నేను జాలిగా చూసేవాడిని

నేను పుట్టీపుట్టగానే పాలకీ, ఆ తిరువాత అన్నానికీ యేడుస్తూనే వున్నానని కాబోలు- అమ్మకి నామీద కోపం. అప్పుడప్పుడు నేను బువ్వ పెట్టమని అల్లరిచేస్తే నా వీపు చరిచేది. ఆ దెబ్బలకి నేను ఏడవనుకానీ ఆ తిరువాత అమ్మ నన్నెత్తుకుని ఎంతగానో యేడుస్తుంది.

నేను అల్లరిచేయకూడదనే అనుకుంటాను కానీ ఒక్కోసారి ఆకలికి నా కడుపులో పేగు లన్నీ ఉండచుట్టుకునిపోతాయి. ఆ బాధకే నేను ఏడ్చేవాడిని

"ఊం! దాటరా...." అంది అమ్మ ఏదో గట్టు అడ్డుపడితే

నేను దాటబోయి పడిపోబోయాను. అమ్మ నన్ను కాచుకుంది నేనా గట్టు దాటాక "అమ్మా! ఇంటికెళ్ళాక నాకు బువ్వ పెడతావా?" అన్నాను

ళాసించి అడిగినప్పుడల్లా అలాగే ఏడుస్తుంది

"ఏడుస్తున్నావా? అమ్మ చెయ్యి పట్టుకు కుదుపుతూ అన్నాను

"లేదురా...లేదు" నాకా సంగతి తెలియకూడదని తడబడుతూ అంది

"అయితే బువ్వ పెడతావా?" మళ్ళీ అడిగాను

నడుస్తున్న అమ్మ ఒక్కసారి ఆగి, "ఇంటి కెళ్ళాక నాన్న నువ్వు తిందురుగాని అల్లరి చేయకేం?" అంది నా గెడ్డం పట్టుకు బుజ్జగిస్తూ

"భలేభలే" నేను చప్పట్లు చరిచాను. అంతలోనే నాన్న జ్ఞాపకానికొచ్చేరు బువ్వ మాట విని నాలాగ నాన్న చప్పట్లు కొట్టలేరు. నాన్న ఎందుకో ఒక చెయ్యి, ఒక కాలు మడత పెట్టుకుని లోతుగానున్న నులకమంచంమీద యెప్పుడూ పడుకునే వుంటారు. ఒక్కోసారి నాకుమల్లే అమ్మే నాన్నకు అన్నం తినిపిస్తుంది మూతి వంకరగా పెట్టి అన్నం తింటారేమో, సగం అన్నం కంచంలోనే పడిపోతుంది.

ఆరుమాసాల క్రితం నాన్న బాగానే వుండేవారు. అప్పట్లో నాన్న వూళ్ళోకి వెళ్ళి పూజలు, వ్రతాలు చేయించి బియ్యం, డబ్బులు తెచ్చేవారు అప్పుడు నేను కడుపునిండా అన్నం తిని హాయిగా ఆడుకునేవాడిని ఈమధ్య నాన్నెందుకలా వూళ్ళో కెళ్ళటం లేదో అమ్మనడిగితే, నాన్నకి పక్షవాతమని మంచం దిగలేరని అమ్మ ఏడుస్తూ చెప్పింది. ఆ మాట విని నాకూ ఏడుపొచ్చింది.

మా యిల్లు చేరుకున్నాం

అమ్మ నాకో మూల కూర్చోమని, తనో మూల కూర్చుంది. నేనాశ్చర్యపోతూనే అమ్మ దగ్గరకెళ్ళి "అమ్మా! కూర్చుండిపోయావేం, బువ్వ పెట్టవా?". అన్నాను

అమ్మ పలకలేదు నావేపు కనీసం కన్నెత్తైనా చూడలేదు అప్పుడర్థమైంది. గత రాత్రిలా, ఆ రాత్రే యింట్లో బువ్వలేదని

ఒక్కసారి నాకేడుపొచ్చింది.

గూట్లో చిన్న దీపం భయం భయంగా వెలుగుతోంది.

మెల్లగా నడిచి ఆ చిరువెలుగులోనే నాన్న మంచం దగ్గరకొచ్చి ప్రక్కన కూర్చున్నాను

నాన్న నాతో ఏదో చెప్పాలనుకుని చెప్పలేక చెక్కుతున్నారు సన్నగా బాధపడుతూ నా తల ఆప్యాయంగా నిమిరి తన పక్కలో పడుకోపెట్టుకున్నారు నేనింకా యేడుస్తూనే వున్నాను.

అమ్మ గబాలున లేచింది. నా దగ్గరగా వచ్చి. "బాబు! ఇవాళ సూర్యమ్మత్త బియ్యం యివ్వలేదుగా, అందుకే నీకు బువ్వలేదు రేపు పప్పు, కూర, చారు- అన్నిటితో నీకు బువ్వ పెడతాను. మరి ఏడవకూ..." అంటూ బ్రతిమలాడింది.

అవును. నాకా క్షణంలో అమ్మమీదకంటే సూరమ్మత్తమీదే ఎంతో కోపం వచ్చింది.

సూరమ్మత్త మా యింటికి చాలా దూరంలో వుంది. అమ్మ రోజూ అక్కడ పప్పు రుబ్బి. నీళ్ళు మోసి అత్తిచ్చిన బియ్యం తెస్తుంది.

రెండు రోజుల నుండి అమ్మకి జ్వరమని ఏ పనీ చెయ్యలేకపోయింది. అందుకే సూరమ్మత్త కనీసం బువ్వకూడా పెట్టలేదు.

అత్త లేదనగానే అమ్మ యింకా చాలా ఇళ్ళకు వెళ్ళింది అందరితోనూ ఏదో చెప్పి బియ్యం అడిగింది. వాళ్ళ మనసు కరగలేదు అంతకు ముందు అలాంటి అవసరాలను ఎన్నో ఆదుకున్నారు! అందుకే ఆఖరిని అందరూ పొమ్మన్నారు.

తిరిగితిరిగి అమ్మా నేను విసిగిపోయాం.

ఇంక వర్షం కురుస్తున్నా ఆగకుండా యిల్లు చేరుకున్నాం.

నాకో అనుమానం వచ్చింది వెంటనే.

"అమ్మా రేపు మళ్ళీ సూరమ్మత్తనే అడుగుతావా బియ్యం?" అన్నాను

"లేదుబాబు! రేపు మనం యెవర్నీ ముష్టెత్తుకో నక్కర్లేదు రేపు ఈ అమ్మలాంటివాళ్ళు చాలామంది నాకు దండం పెట్టి చేటలతో బియ్యం యిస్తారు. అవి తెచ్చి అన్నం వండి, నీ కడుపునిండా బువ్వ పెడతాను" అంది చిన్న నవ్వు నవ్వుతూ

"భలెభలే మరి రేపెప్పుడొస్తుంది?" అన్నాను ఆశగా

నా తెలివితక్కువ ప్రశ్నకు అమ్మ మరోసారి నవ్వింది. గత మూడు రోజులుగా లేని ఆ నవ్వు అమ్మ పెదవులమీద ఆ రోజు చూశాను

"నువ్విప్పుడు కళ్ళు మూసుకుని పడుకుంటావుగా! అప్పుడెవరో వీధిలోనుండి 'అనసూయమ్మా... అనసూయమ్మా' అంటూ నన్ను పిలుస్తారు అప్పుడు రేపొచ్చినట్టే!" అంది నాకర్థమయేలా చెప్పాలని.

నేను మంచంమీద పడుకునే మళ్ళీ చప్పట్లు చరిచాను

అమ్మ నా నుదురుమీద గుచ్చటగా ముద్దు పెట్టుకుంది. అప్పుడు "అమ్మా! నీ నోరు వేడిగా'



నీ వూపిరి వెచ్చగా వుందేం?" అన్నాను

అమ్మ సమాధానం చెప్పలేదు.

అమ్మకు విపరీతమైన జ్వరం పైపుంటుందని నా ప్రశ్న ద్వారా నాన్నకు తెలిసిపోయుంటుంది కాబోలు. కుక్క పిల్లలా అరిచాడు. అమ్మ నీరసంగా చాప మీద నడుం వాల్చింది

వీధిలో ఒక్కసారి పెద్దగా ఉరిమింది చెట్లు విరిగి నేలకూలేలా గాలి అందుకే కాబోలు మా ఇంట్లో దీపం కాస్త ఆరిపోయింది

యెవరో మమ్మల్ని పెట్లో పెట్టి మూత వేసి నట్టుగ ఒక్కసారి చీకటి...

చెప్పేమన్నాను భయంగా ఏడ్చాను

అమ్మకూడా నాలాగే గభాలున లేచింది కాబోలు నాన్నసూ నన్ను ఒకసారి తడిమి చెప్పు మని అరిచింది

నేను మరింత భయపడి పోయాను మంచం దిగి అమ్మ ఒళ్ళో పడిపోయాను

ఆ తరువాత అమ్మ ఆ రాత్రంతా అలా ఏడుస్తూనే వుంది

తెల్లవారింది.

—"అమ్మా అనసూయమ్మ కొండయ్య బావింటికి పంతులుబాబు మిమ్మల్ని వేగి తీసుకురమ్మన్నారు రెండమ్మా" వీధిలో యెవరో పిలవడం నాకు వినిపించింది.

అమ్మ నిశ్చేష్టురాలయి ఉండిపోతే నేనే అన్నాను "అమ్మా ఇదిగో రేపొచ్చింది" అని

అమ్మ చీర కాస్త సర్దుకుని లేచి బలం కూడదీసుకుని, నిలబడి పైట చెంగుతో ముఖం తుడుచుకుని, నాన్నను పూర్తిగా ఓ పంచెతో కప్పి వీధిలోకి నడిచింది

ఆ వ్యక్తి, అమ్మా, నేనూ నడుస్తున్నాం. మేమెక్కడికెళ్తున్నామో, ఆ కొండయ్యబాబెవరో అతనెందుకు అమ్మను పిలిపించారో నేను అమ్మనడగలేదు అమ్మకూడ నాతో చెప్పలేదు ఆ ఇంటికెళ్ళాక అన్నీ తెలిశాయి.

పాపం! కొండయ్యబాబు భార్య చచ్చిపోయిందట అతను పెద్ద డబ్బున్న కోమటి కార్యం పెద్దగా చేస్తున్నాడు. అందుకని ఆవిడ పేరున అమ్మకి మూసివాయనం ఇస్తారట అక్కడెవరెవరో ఆ మాటలు అనుకోగా నేను విన్నాను.

మూసివాయనం అంటే నాకు తెలీదు అమ్మకి ఎవరో చేతులతో బియ్యం ఇస్తానన్నది బహుశా అదే కాబోలు అనుకున్నాను.

కొండయ్యబాబు గడపలో అమ్మ కూర్చుంది. అమ్మ చుట్టూ ఎందరో ఆడవాళ్ళు కూర్చుని. చచ్చిపోయిన ఆమె పేరుతో అమ్మమీద చేతులు వేస్తూ పెద్దగా యేడుస్తున్నారు

అమ్మకూడా ఏడుపు ముఖం పెట్టింది నేనూ ఏడవాలని కళ్ళు నలుముకుంటున్నాను అంతలోనే అమ్మ నావేపు చూసి సన్నగా నవ్వింది నేనూ నవ్వేశాను

పంతులుగారొచ్చి అమ్మను లేవగొట్టారు అమ్మతో పాటు అక్కడున్న ఆడవాళ్ళంతా లేచారు

నేను అమ్మ చెయ్యి పట్టుకున్నాను

"చూడమ్మా ఇప్పుడు మనం ఏటికి వెళ్ళాలి" అన్నారు పంతులుగారు

కొండయ్యబాబు చుట్టాలు. స్నేహితులతో మేమూ ఏటికి బయలుదేరాం

సగం దారి తరిగిందో లేదో నేను మరి నడవలేనని చెప్పి అమ్మ నెత్తుకోమన్నాను అమ్మ నన్ను ఒకసారి మీదకెత్తబోయి ఆగిపోతుంటే ఎవరో కసురుకున్నారు అంతే అమ్మ మళ్ళీ నన్ను నడవమంది.

దూరంగా నాగావళినది కనిపించింది

అందరం ఒడ్డు చేరుకున్నాం

పంతులుగారూ మా అమ్మ దగ్గరో పీట వేసి కూర్చోమన్నారు. అప్పుడు మాత్రం అమ్మ నాకు దూరంగానే ఓ చోటు చూపించి కూర్చోమంది.

నేను బుద్ధిగా కూర్చున్నాను.

కొందరాడవాళ్ళు అమ్మ చుట్టూ నిల్చుని, అమ్మ తల రుద్దుతున్నారు ఆ తరువాత ముఖానికి వంటికి పసుపు రాసి యేట్లో నుండి నీళ్ళు తెచ్చి అమ్మ మీద గుమ్మరించారు

జ్వరంతో వున్న అమ్మ వంటి మీద అలా చల్లటి నీళ్ళు పడగానే ఒక్కసారి చలికి వజవజ వణికిపోతూనే కొయ్యబారి పోయింది. అప్పుడు పరుగు పరుగున అమ్మ దగ్గరికెళ్ళి, "అమ్మా! వీళ్ళు చేతులతో బియ్యం ఇవ్వకుండా ఇలా చేస్తున్నారేం?" అని అడగాలనుకున్నాను. కానీ అమ్మ నాకు నోరెత్తకుండా అన్నీ చూస్తూ కూర్చుంటేనే బువ్వ పెడతానంది అందుకే మళ్ళీ లేచిన వాణ్ణి అలాగే కూర్చుండిపోయాను.

ఐదు నిముషాలు అయిందో లేదో అమ్మ కొత్త చీరతో పెద్ద బొట్టుతో కాళ్ళకు పారాణితో పీట మీద కూర్చుంది

చిన్న బొట్టుతో ఎంతో అందంగా కనిపించే అమ్మ అప్పుడా అలంకరణలో దెయ్యంలా కనిపించింది ఒక్కసారి తుళ్ళిపడ్డాను

పంతులుగారొచ్చి "ఆ..యిక మూసివాయనం అందివ్వండి" అన్నారు నాలో ఆనందానికి అవధులు లేకపోయాయి అమ్మ వేపు నవ్వుతూ చూశాను

కొందరాడవాళ్ళు చేటమీద మరో చేట బోర్లించి చేతులతో పట్టుకుని అమ్మ ముందు నిలబడ్డారు ఆ చేటలు సరుతున్నప్పుడు నాకు అందులో వున్న పరికరాలన్నీ కనిపించాయి

అమ్మ చెప్పినట్టుగా ఆ చేటల్లో బియ్యమే కాదు పసుపు కుంకుమ, గాజులు, పూసలు, అరటిపళ్ళు, తమలపాకులు, చెక్కలు వగైరా ఎన్నో వున్నాయి. అవన్నీ చూసిన నాకు ఒక్కసారి ఎగిరి గంతులేయాలనిపించింది

ఆ చేటలు మా అమ్మకు అందివ్వబోతున్నారో లేదో అంతలోనే అక్కడికి సూరమ్మత్త వచ్చి "ఏమ్మా అనసూయమ్మా! నీకు బుద్ధిలేదూ, నువు మూసివాయనం అందుకోడానికి వచ్చావా?" అంది.

నా గుండె కొట్టుకుంటోంది "అమ్మ మీద ఆమెకెందుకు కోపం? ఆ బియ్యం ఇవ్వద్దంటున్నాదేం?" అనుకున్నాను.

"ఏం జరిగింది?" ఎవరో ఒకామె అడిగింది.

"ఆదేనమ్మా! ఈ రోజు మా కోడలు బైటుంది కాస్త నీళ్లు మోస్తుందేమోనని ఈవిణ్ణి పిలవటానికి ఇంటికి వెళ్ళాను. తీరా ఈవిడ భర్త అక్కడ చచ్చిపోయి వున్నారు ఆ సంగతి ఈవిడకూ తెలుసు లేకపోతే అతన్ని పూర్తిగా బట్టతో ఎందుకు కప్పుతుంది?" అంది.

అంతే!

మూసివాయనం ఆగిపోయింది. అమ్మకు గుండెకూడ అప్పుడే ఆగిపోయిందేమో పెను గాలికి విరిగిన మ్రానులా వెనక్కు పడిపోయింది ఆ మాట విని

ఆ తరువాత సూరమ్మత్త ఆ బియ్యం, డబ్బులు అందుకుంటుంటే చూస్తూనే నా కళ్ళు చీకట్లు క్రమ్మాయి. ❋



## సస్పెన్స్

రోగికి తెలివొచ్చింది.

"నా ఆపరేషన్ సక్సెస్ అయినట్లేనా డాక్టర్?" అడిగాడు.

"ఉష్! ఇది ఆసుపత్రి కాదు, యమలోకం నా పేరు చిత్రగుప్తుడు" అన్నాడు ఎదుటి వ్యక్తి.

-కె.వి. శ్రీనివాసమూర్తి (కొండసముద్రం)

?

గాలిబ్

